క్లుప్తంగా

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం సచివాలయ సిబ్బంది పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన నగరంలోని కొత్తపేటలో ఉన్న సచివాలయాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో ఉన్న మాతాశిశు సంరక్షణ (ఎంసీపీ)కార్డులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, మాస్ మీడియా సిబ్బంది ఖలీల్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న అభ్యర్థులు, మాట్లాడుతున్న డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సహకరించాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అభ్యర్థులను కోరారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ తరఫున వచ్చిన ఆయన కుమారుడు ఎ.చైతన్య, స్వతంత్ర అభ్యర్థులు మోహన్‌రెడ్డి, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల ప్రచారం కోసం వినియోగించే వాహనాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ నిర్వహణకు పూర్తిగా సహరించాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకొని వివరాలను అందజేయాలన్నారు. రెండు రోజులకొకసారి చేసిన ఖర్చుల వివరాలను అందజేయాలని కోరారు.

పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ (పీటీడీ) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ కర్నూలు–2 డిపో కార్యదర్శి మహేశ్వరరావు కోరారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు–2 డిపో కార్యాలయంలో బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధికారులు జాప్యం చేయడం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ముత్యాల రెడ్డి, కృష్ణార్జునరెడ్డి, శివకేశన్న, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సల్కాపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కల్లూరు: పరీక్షలు సమీపిస్తుండటంతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ. రంగారెడ్డి పదోతరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం రాత్రి పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సంబంధించి సల్కాపురం విద్యార్థుల ఇళ్లకు ఆయన వెళ్లారు. నైట్ విజన్‌లో భాగంగా గ్రామంలో మనీషా, ఇందూ, అంజలీ, మేఘన, లక్ష్మిబాయి ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. పరీక్షలంటే భయం విడి ప్రశాంతంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలన్నారు. డీఈఓ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవీలత, అరుణ, సునీత ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేర్ వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషన్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, కొకైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ : డెడ్‌లైన్ **విజయ :** సార్

అపురూపం.. గోదా గోకులం

- ఎన్నో ప్రత్యేకతలతో రూపుదిద్దుకున్న ఆధ్యాత్మిక క్షేత్రం
- కర్నూలు నగర శివారులో రూ.100 కోట్లతో నిర్మాణం
- నేడు శ్రీరంగనాయకి గోదా సమేత రంగనాథ పెరుమాళ్ మూర్తుల ప్రతిష్ఠ



గోదా గోకులం వ్యూ



గృహ సముదాయం, గృహాలపై ఆధ్యాత్మిక చిత్రాలు



గోదా గోకులం ఆలయ దృశ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాల పాడు గ్రామం వద్ద ఆధ్యాత్మిక పవిత్ర పుణ్య క్షేత్రం రూపుదిద్దుకుంది. ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశేషాలతో గోదా గోకులం రూపంలో ఈ నెల 1వ (నేటి నుంచి) తేదీన భక్త కోటికి అందుబాటులోకి రానుంది. కర్నూలు నగరానికి చెందిన శ్రీ గోదా విష్ణు సహస్రనామ మండలి, శ్రీగోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గోదా విష్ణు నిత్యసేవాధామ్, శ్రీ గోదా పరివారం సంయుక్తంగా సుమారు 5 ఎకరాల స్థలంలో రూ.100 కోట్లతో ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దారు. హరి నామమే కడు ఆనందమయమూ అన్నట్లుగా గోదా గోకులం సందర్శనం కొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. అర ఎకరంలో శ్రీరంగ నాయకి గోదా సమేత శ్రీ రంగనాథ పెరుమాళ్, సుదర్శన గరుడ, ఆళ్వారాచార్యుల దేవతా మూర్తుల విగ్రహాలతో కూడిన రాతి కట్టడ ఆలయం నిర్మాణం చేశారు. ఆలయం పైకప్పుకు గోదా రంగనాథ స్వామి చరిత్రను తెలిపే కళాత్మకత ఉట్టిపడే చిత్తరువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ప్రతి ఇల్లూ ఒక దేవాలయంలా..

ఇక్కడ ప్రతి ఇల్లూ ఒక దేవాలయంగా నిలుస్తోంది. క్షేత్రంలోని 106 ఇళ్లు, ప్రవచన మండపం, ఆలయ నిర్మాణం కలిపి మొత్తం 108 దివ్య దేశాలకు ప్రతి రూపంగా దర్శనమిస్తున్నాయి. ఆలయం చుట్టూ మాడవీధులలో లీలా విభూతిలోని 106 దివ్య దేశాల తిరునామాలతో 106 భాగవతుల తిరుమాళిగలు (గృహాలు), ఆగృహాలపై శంఖు చక్ర తిరునామాలు, గరుడ, హనుమచిత్రాలు, ప్రతి గృహానికి ఒక దివ్య దేశపు పేరు, తిరుప్పావై భావనాచిత్రాలతో నిర్మించారు. స్వామివారికి నిత్య కల్యాణం, హోమ కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు జరిగాయి. ఆలయం చుట్టూ స్వామివారిని ఊరేగించేందుకు అనువుగా విశాలమైన నాలుగు మాడ వీధులు నిర్మాణం అద్భుతమనే చెప్పాలి.

అరుదైన ఆలయం...

తుంగభద్ర నదికి సమీపంలో నగర శివారులో నిర్మితమైన గోదాగోకులంలో గత నెల 19 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బుధవారం దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాటు చేశారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో శ్రీరంగనాథుని క్షేత్రాలు అరుదుగా కనిపిస్తాయి. నందికొట్కూరు నియోజకవర్గం తర్తూరులో శ్రీరంగనాథుని ఆలయం ఉంది. శ్రీరంగనాథుడికి అతి పెద్ద ఆలయం ఇప్పుడు కర్నూలు నగరంలో నిర్మాణమైంది. తమిళనాడులోని శ్రీరంగం క్షేత్రం తరువాత అంత పెద్ద ఆలయం కర్నూలులో వచ్చిందని భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని చెందుతున్నారు.

మరో ఇల వైకుంఠపురంగా...



కర్నూలు నగరం సమీపంలో నిర్మితమైన గోదా గోకులం మరో ఇల వైకుంఠపురంగా వెలుగొందుతుందనే విశ్వాసం ఉంది. 5 ఎకరాల స్థలంలో అర ఎకరంలో రంగనాథుని ఆలయం, మిగతా 4.30 ఎకరాల్లో విష్ణు సహస్ర నామ మండలి సభ్యులు 106 మంది ఇక్కడ గృహాలు నిర్మించుకున్నాం. సభ్యులు అందరూ ఐకమత్యంగా మెలుగుతూ ఆధ్యాత్మిక మార్గానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాం. – మారం నాగరాజు గుప్త, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు

కర్నూలుకు మకుటాయమానం



కర్నూలు నగరానికి ఒక పవిత్ర పుణ్య క్షేత్రం అందుబాటులోకి వచ్చింది. గోదా గోకులం ప్రాంగణంలోకి అడుగు పెట్టడమే ఆలస్యం ఆధ్యాత్మిక ప్రపంచంలో విహరించిన భావన కలుతుంది. గోదా గోకులం సభ్యులు అందరూ ఓకే ప్రాంగణంలో నివాస గృహాలను ఏర్పాటు చేసుకొని ఎవరి వృత్తి వారు చేసుకుంటూ భగవంతుని సేవలో తరిస్తున్నాం. భవిష్యత్తులో ఇదొక పవిత్ర పుణ్య క్షేత్రంగా వెలుగొందుతూ కర్నూలుకు మకుటాయమానంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. – పల్లెర్ల నాగరాజు, గోదాగోకులం మేనేజింగ్ ట్రస్టీ

మండలి ఎన్నికల్లో రవీంద్రారెడ్డిని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): త్వరలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన 17 వార్డులోని విద్యా సంస్థలు, అపార్ట్‌మెంట్లలో ఎన్నికలప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటును రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలనికోరారు. తమది సంక్షేమ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలపరచిన అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికవర్‌లో నర్సింగ్ ఎక్సలెన్స్ ట్రైనింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో మంగళవారం నర్సింగ్ ఎక్సలెన్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో హాస్పిటల్ నర్సింగ్ సిబ్బందితో పాటు వివిధ నర్సింగ్ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ శిక్షణ ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో రోగికి అందించే వైద్య సేవల గురించి వైద్యులు వివరించారు. చిన్నపిల్లలకు అత్యవసర సమయంలో ఎలాంటి వైద్యసేవలు అందించాలో వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు సుదర్శన్‌రెడ్డి, టి.వి.సునిల్ యాదవ్, మురార్జీ, హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను శాసన మండలి స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో కలిసి మండలి ఎన్నికల్లో తన గెలుపు కోసం పూర్తి సహకారం అందించాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారని, ఈ నేపథ్యంలో కర్నూలు మండలి టికెట్‌ను బీసీకి ఇవ్వడం అభినందనీయమని ఎంపీ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాని హామీ ఇచ్చారు.

శ్రీమన్నారాయణ ఇష్టితో సకల శుభాలు



అఖండ హరినామ సంకీర్తన చేస్తున్న భజన బృందం భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీమన్నారాయణ ఇష్టి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సముద్రాల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమన్నారాయణ ఇష్టితో సకల శుభాలు కలుగుతాయన్నారు. వివిధ ధార్మిక సంస్థల సభ్యులు, భజన మండళ్ల అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. రేణుశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. బుధవారం దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలతో మానసిక వికాసం

కర్నూలు కల్చరల్: కర్నూలు బాలోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. స్థానిక ఇండస్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు పలు అంశాల్లో ప్రదర్శన ఇచ్చారు. ముగింపు వేడుకలకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకరశర్మ, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల నుంచి బాలోత్సవంలో పాల్గొన్న అందరూ విజేతలే అన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందన్నారు. కన్వీనర్ ఎం.పి. బసవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్ర పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య, ఇండస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్, బాలోత్సవం కార్యదర్శి జేఎస్ శేషయ్య, సమత కన్వీనర్ రమాదేవి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

➡ సచివాలయాల తనిఖీ

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని నరసింగరావు పేటలో ఉన్న 1, 2 సచివాలయాలు, ప్రకాష్ నగర్‌లోని 125, 126, 130 సచివాలయాలను మంగళవారం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.


➡ రాజ శ్యామల హోమం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో రాజశ్యామల హోమం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుటుంబ సభ్యులు హోమంలో పాల్గొన్నారు.

➡ తైక్వాండోలో ప్రతిభ

కర్నూలు(టౌన్): ఈ నెల 25వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో జిల్లా పోటీల్లో ప్రతిభ చాటిన రిడ్జ్ పాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల సీఈఓ గోపీనాథ్ మంగళవారం అభినందించారు.

ప్రీతినాయక్ మృతిపై విచారణ జరిపించాలి



ప్రీతి నాయక్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ మెడికల్ కాలేజ్‌లో ర్యాగింగ్ భూతానికి బలైన జూనియర్ డాక్టర్ ప్రీతి నాయక్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య, అఖిలభారత విద్యార్థి సమైక్య, అఖిలభారత యువజన సమైక్యల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రీతి నాయక్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మహిళా సమైక్య జిల్లా నాయకురాలు జయలలితమ్మ, నగర అధ్యక్షురాలు శ్రావణి రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ.. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న ప్రీతి నాయక్ కుటుంబ సభ్యులపై చేయి చేసుకున్న పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. అదేవిధంగా ర్యాగింగ్‌కు కారణమైన సైఫ్‌ను అరెస్టు చేసి, ర్యాగింగ్‌పై కంప్లయింట్ ఇచ్చినప్పటికీ పట్టించుకోని మెడికల్ కాలేజ్ హెచ్‌ఓడీ, కాలేజ్ ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామంజి, శివన్న, నాగరాజు, సుధా దేవి, జయమ్మ, పావని, స్వప్న, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన నమూనాను పరిశీలిస్తున్న మేయర్ రామయ్య



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానందపుచ్చా

కర్నూలు సిటీ: నగరంలోని పలు విద్యా సంస్థల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ యూనివర్శిటీలో నిర్వహించిన వేడుకల్లో రెక్టార్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సీ.వీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చాలు పాల్గొని ప్రసంగించారు. అదే విధంగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ ఆచార్యులు పి.కె సురేష్, సీడీసీ డీన్ ఆచార్య ఎం.ఈ రాణి, పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మాశ కాలేజీ వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపాల్ డా.రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఉస్మానియా కాలేజీలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, వెంకటరమణ కాలనీలోని శ్రీలక్ష్మీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ వంశీకృష్ణ, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో క్లస్టర్ యూనివర్శిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేశవరెడ్డి స్కూల్‌లో ఎడ్యు ఎక్స్‌పో

పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు మంగళవారం వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి స్కూల్‌లో ఎడ్యు ఎక్స్‌పోను నిర్వహించారు. ఇందులో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు అర్బన్ 21వ వార్డులోని గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ సీవీ రామన్ సైన్స్‌లో చేసిన సేవలను కొనియాడారు.

కర్నూలు కల్చరల్: సైన్స్‌డే సందర్భంగా రవీంద్ర విద్యా సంస్థల్లో సినర్జీ 2కే23ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి వేడుకలు ఉపయోగ పడతాయన్నారు. విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ మమతా మోహన్, వైస్ ఛైర్మన్ వంశీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల వైస్ పిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ సీవీ రామన్ దేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్త అన్నారు. ఆయన స్ఫూర్తితో సైన్స్ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో కర్నూలు అథ్లెట్లకు పతకాలు

కర్నూలు (టౌన్): ఈ నెల 26, 27 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలోని అల్లూరి సీతారామరాజు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన 18వ యూత్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు అథ్లెట్లు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన అథ్లెట్లను మంగళవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి. హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మయ్యలు అభినందించారు. 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో షేక్షావలి (ప్రథమస్థానం), లాంగ్‌జంప్‌లో కె.మంజునాథ్ (తృతీయ స్థానం), షాట్‌పుట్‌లో కె.జస్వంత్ (తృతీయ స్థానం)లో నిలిచినట్లు వారు పేర్కొన్నారు.

అథ్లెట్లకు అభినందన

కర్నూలు(టౌన్): ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు కలకత్తా పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లాకు చెందిన మాస్టర్ అథ్లెట్లు పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మంగళవారం మౌర్య ఇన్‌లోని తన చాంబర్‌లో ఆ అథ్లెట్లను అభినందించారు. 5 కిలో మీటర్ల నడకలో సీమ ఏలిగే (మూడో స్థానం), బందే నవాజ్ 400 మీటర్ల హార్డిల్స్ విభాగంలో (రెండవ స్థానం), 4ఇన్‌టూ 400 మీటర్స్ రిలేలో రెండవ స్థానం, 4 ఇన్‌టూ 100 మీటర్లలో (మూడవ స్థానం)సాధించారు. ఇదే విభాగంలో చెన్న కేశవ రెడ్డి వెండిపతకం, పాండురంగారెడ్డి జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించాడు. పతకాలు సాధించిన వీరందరు వచ్చే అక్టోబర్ నెలలో ఫిలిప్పిన్స్ దేశంలో నిర్వహించనున్న ఏషియన్ మీట్‌కు ఎంపిక కావడంపై టీజీ హర్షం వ్యక్తం చేశారు. అథ్లెట్లకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రరెడ్డి, మద్దిలేటి రెడ్డి, జిల్లా అధ్యక్షులు పాండురంగారెడ్డి, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి

కర్నూలు కల్చరల్: పరీక్షలు అంటే భయం వద్దని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌ఏపీ క్యాంప్ నగర పాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి పబ్లిక్ పరీక్షల్లో ఎలా విజయం సాధించడం అనే అంశంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. రామాయణ, మహాభారత ఇతిహాస గాథలను కథ రూపంలో, నిజ జీవితంలోని ఆసక్తికర అంశాలను వివరించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ప్రణాళిక బద్ధంగా సబ్జెక్టులను కేటాయించుకొని సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.మహబూబ్ బాషా, ఎస్‌బీఎస్‌ఈ కంప్యూటర్ అధినేత లయన్ రాయపాటి శ్రీనివాసరావు, జేవీవీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హాకీ పోటీలు



విజేతగా నిలిచిన బాలుర జట్టుకు ట్రోఫీ ఇస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న దాసరి సురేష్ మెమోరియల్ హాకీ టోర్నమెంటు పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో గార్గేయపురం జట్టు 2–1 గోల్స్ చేసి విజయం సాధించింది. అలాగే బాలికల విభాగంలో మునగాలపాడు జట్టు 3–0 గోల్స్ చేసి విజేతగా నిలిచింది. విజేతలుగా నిలిచిన బాల బాలికల జట్లకు హాకీ సంఘం ఉపాధ్యక్షులు ప్రవీణ్, మేరీ జాస్మిన్‌లు మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, కోశాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధరలు తగ్గకుండా చూడాలి

కర్నూలు(సెంట్రల్): పత్తి ధరలు పడిపోకుండా చూడాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వారం రోజుల్లో దాదాపు రూ.1000 క్వింటానికి తగ్గిందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తికి క్వింటాల్‌కు కనిష్ఠంగా రూ.5600, గరిష్ఠంగా రూ.7800 మాత్రమే ఉందన్నారు. క్వింటం రూ.10 వేలు పలికితే తప్పా రైతులకు గిట్టుబాటు కాదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

ఖబరస్తాన్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి

కర్నూలు (టౌన్): మార్చి 7వ తేదీన బడేరాత్ ఉన్నందున కర్నూలు నగరంలోని ముస్లిం శ్మశాన వాటికల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని నగరపాలక సంస్థకు చెందిన ముస్లిం మైనార్టీ కార్పొరేటర్ల బృందం విన్నవించారు. మంగళవారం స్థానిక నగరపాలకలో నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి. రమాదేవి, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డిలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పాతబస్తీ, ఆనంద్ థియేటర్ వద్ద, కల్లూరు, ఆటో నగర్, కొత్తపేట, జొహరాపురం, రోజా దర్గా లలో ఉన్న ఖబరస్తాన్‌లను పరిశుభ్రంగా చేయడం, మంచినీరు వంటి వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కార్పొరేటర్లు షేక్ యూనస్‌బాష, ఫరాజ్‌ఖాన్, కృష్ణకాంత్, షేక్ అహమ్మద్, కోఆప్షన్ మెంబర్ నయూమ్ పాల్గొన్నారు.